క్లుప్తంగా

నేడు మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని కోరారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

టైలర్ షాపులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

● రూ.2 లక్షల ఆస్తినష్టం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కుట్టుమిషన్లు, దుస్తులు

కోవెలకుంట్ల: పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో ఉన్న రాజు టైలర్ షాపులో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. బుధవారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లాడు. విద్యుత్ వైర్ల ఎర్త్ కారణంగా షాపులో మంటలు చెలరేగాయి. షాపులోని కుట్టుమిషన్లు, కుట్టి ఉంచిన దుస్తులు, ఇతర వస్తువులు కాలిపోయాయి. గురువారం ఉదయం షాపు తెరవగా అగ్నిప్రమాదం జరిగినట్లు గుర్తించాడు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హనుమంతునాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లా తిరుపతిలో సీఐగా పనిచేస్తున్న జయచంద్రను ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడ సీఐగా నియమించారు. సీఐల సాధారణ బదిలీల్లో ఆళ్లగడ్డ రూరల్ సీఐగా పనిచేస్తున్న హనుమంతునాయక్‌ను కోవెలకుంట్లకు బదిలీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐని కోవెలకుంట్ల ఎస్‌ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల: స్థానిక జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. గురువారం ఆమె విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో బాలుర విభాగంలో తమ పాఠశాలకు చెందిన శరత్‌కుమార్‌రెడ్డి, తేజ కిరణ్, హేమంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, హేమచంద్రుడు, శ్రీనాథ్‌రెడ్డి ప్రతిభ చాటి ఈనెల 10న చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లాస్థాయిలో సత్తాచాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కరస్పాండెంట్ సవిత్నాథ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, నాగార్జున, శృతి, సురేష్ అభినందించారు.

తండ్రీకొడుకులకు గాయాలు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలోని జిల్లా సరిహద్దు ప్రాంతంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయలయ్యాయి. అంకిరెడ్డిపల్లెకు చెందిన తండ్రీకొడుకు దాసరి వెంకటనారాయణ, స్వరూప్ పని నిమిత్తం బైక్‌లో తాడిపత్రికి వెళ్లి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో జిల్లా సరిహద్దులోని పొలిమేర పెద్దమ్మ ఆలయం వద్దకు రాగానే ఎదురుగా ప్రయాణిస్తున్న ఆల్విన్ ఢీకొనడంతో వెంకటనారాయణ ఎగిరి కింద పడటంతో స్వల్పగాయాలతో బయట పడ్డాడు. బైక్ నడుపుతున్న కుమారుడు స్వరూప్ కాలికి తీవ్ర గాయమైంది. వీరిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

నేడు ఆడిటోరియం ప్రారంభం

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థి శిల్పా ప్రతాప్‌రెడ్డి ఆర్థిక సహకారంతో నిర్మించిన ఆడిటోరియాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు పూర్వ విద్యార్థి, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రార్థన సమయంలో విద్యార్థులు వర్షాకాలంతో తడుస్తూ, వేసవికాలంలో ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతుండటంతో గుర్తించి పూర్వ విద్యార్థి ఆడిటోరియం నిర్మాణానికి రూ.14 లక్షలు ఆర్థికసాయం అందించడంతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఆడిటోరియం ప్రారంభోత్సవానికి కళాశాల పూర్వ విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

డోన్ : ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందే రోగులకు మూడు పూటలా పౌష్టికాహారం అందించే కార్యక్రమం డోన్‌లో గురువారం మొదలైంది. స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం ఇడ్లీ, పొంగల్, ఉప్మా, పాలు, మధ్యాహ్నా భోజనం అన్నం, లేదా పుల్కా, విజిటబుల్ కర్రీ, సాంబర్, పెరుగు, బాయిల్డ్ ఎగ్‌తో పాటు అరటి పండు, రాత్రి అన్నం లేదా పుల్కా, విజిటబుల్ కర్రీ, సాంబర్, బాయిల్డ్ ఎగ్ అందజేస్తామని వెల్లడించారు.



బనగానపల్లెలో నాగులపుట్టకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బేతంచెర్లలో పుట్టకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

●భక్తిశ్రద్ధలతో నాగులచవితి

బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో గురువారం నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో వెలసిన పుట్టల వద్దకు మహిళలు తరలివెళ్లి పాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు స్థానిక నాగుల కట్ట వద్ద నాగుల ప్రతిమలకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. నాగుల చవితి సందర్భంగా ప్రజలు నూగుపిండి వంటకాలు, గుగ్గిళ్లు తదితరవి తయారు చేసుకుని పండుగను ఘనంగా జరుపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి పుట్టకు పాలు పోస్తున్న భక్తులు

వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు సరికాదు

డోన్ టౌన్ : భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్‌ఫొగాట్‌పై అనర్హత వేటు బాధాకరమని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. వేటుపై లోక్ సభలో ప్రస్తావించాలని వారు డిమాండ్ చేశారు. అనర్హత వేటును ఖండిస్తూ గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు నాయకులు ఎంఆర్ నాయక్, మండల కార్యదర్శి ఆశోక్, డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి నక్కి హరి మాట్లాడుతూ స్టార్ రెజ్లర్‌పై వేటు భారతీయ క్రీడాకారులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.
– స్టార్ రెజ్లర్‌పై అనర్హత వేటుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర క్రీడలశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పొదుపు రికార్డులకు నిప్పు

బేతంచెర్ల: మండలపరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలోని విజేత గ్రామైక్య సంఘం కార్యాలయంలో రికార్డులకు గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. ఉదయం అటు వైపు వెళ్లిన పొదుపు మహిళలు గమనించి మంటలను అదుపు చేశారు. అప్పటికే కార్యాలయంలో పొదుపు గ్రూపులకు సంబంధించిన 2 రికార్డులు పూర్తిగా కాలిపోగా, 14 రికార్డులు పాక్షికంగా కాలినట్లు వీఓఏ భూలక్ష్మి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు.



కాలిపోయిన రికార్డులు

'సూపర్ సిక్స్' భయం అప్పుడు లేదా?



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

● సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి బుగ్గన ధ్వజం

ప్యాపిలి: ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీల గురించి ఊదరగొట్టినప్పుడు చంద్రబాబు నాయుడుకు భయం కలుగలేదా? అని మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రశ్నించారు. పోదొడ్డి గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను చూస్తుంటే భయమేస్తున్నదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి రావడం అలవాటుగా చేసుకున్న చంద్రబాబు మరోసారి తన నిజస్వరూపం బయట పెట్టుకున్నాడని విమర్శించారు. 'నీకు 15 వేలు.. నీకు 15 వేలు' అని ప్రచారం చేసిన వారు ఇప్పటి వరకు సింగిల్ 15 వేలు కూడా ఇవ్వలేకపోయారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చి వేచి చూడాలని తాము భావించామని అయితే.. హామీలను తుంగలోకి తొక్కేందుకు సాకులు వెతుకున్న తీరును చూసి ప్రజల తరఫున ఇప్పుడే గళమెత్తాల్సి వస్తుందని వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అరాచకాలకు తెర తీశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి పాత ఫ్యాక్షన్ సంస్కృతికి మళ్లీ ప్రాణం పోస్తూ.. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.



మంత్రి బుగ్గనను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఈసుం బాషా కుటుంబ సభ్యులు, గూటుపల్లె గ్రామస్తులు

కార్యకర్తలకు అండగా ఉంటా

బేతంచెర్ల: పార్టీకి పునాదిలాంటి కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన హవల్దార్ ఈసుం బాషా ఫిబ్రవరిలో అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండెపోటుకు గురై మరణించాడు. బాధిత కుటుంబానికి పార్టీ తరఫున రూ. 10 లక్షలు సాయం అందించారు. ఈ నేపథ్యంలో ఈసుం బాషా కుటుంబ సభ్యులు మాజీ మంత్రి బుగ్గనను గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బుగ్గన మాట్లాడారు. సమస్యలపై చర్చించారు. మీకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి, నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, రామచంద్రుడు, ముర్తుజావలి, ఖాజా, మురళీకృష్ణ , రుద్రవరం నారాయణ, ఇబ్రహీమ్, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి



బుగ్గానిపల్లె తండాలో మాట్లాడుతున్న న్యాయమూర్తి పి. రాహుల్ అంబేడ్కర్

బేతంచెర్ల: సమాజంలో అభివృద్ధి చెందాలంటే చదువుతోనే సాధ్యమని డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. రాహుల్ అంబేడ్కర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా, గోరుమానుకొండ తండాలో మండల న్యాయ సేవా సమితి, మండ లీగల్ సర్వీస్ కమిటీ డోన్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు, హ్యాండ్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలు , సలహాల కోసం మండల లీగల్ సర్వీస్ కమిటీ సంప్రదించాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు , గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్ బాబు, డీటీ మధు, వైద్యురాలు స్వప్న ప్రియ వాణి, ఎస్‌ఐ శివ శంకర్ నాయక్, ఈఓ ఆర్డీ వెంకట రంగ నాయక్, సర్పంచ్‌లు ఆదిలక్ష్మి బాయి, వెంకటేశ్వర్లు, హ్యాండ్స్ మధు, న్యాయ వాదులు వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

బేతంచెర్ల తహసీల్దార్‌గా సూర్య ప్రకాశ్ బాబు

బేతంచెర్ల: మండల నూతన తహసీల్దార్‌గా ఎస్ సూర్య ప్రకాశ్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో డీటీ మధు, ఆర్‌ఐ శ్రీదేవి, సర్వేయర్ జ్యోత్స్న, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు, గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ తదితరులు తహసీల్దార్‌కు బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్

కోవెలకుంట్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ రహిమాన్ సూచించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మారకద్రవ్యాల నిషేధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ యువకులు మద్యం, గుట్కా, గంజాయి, హెరాయిన్, కొకైన్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల వారితోపాటు ఎదురుగా వచ్చే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయి ఆయా కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. మత్తు పదార్థాలు విక్రయించడం చట్టరీత్యా నేరమని, కేసు రుజువైతే 10 నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, కార్యదర్శి ఓబులేసు, న్యాయవాదులు మల్లికార్జున, నరసింహులు, ఖాసీం సాహెబ్, రాజశేఖర్, రమేష్, కంబగిరి, శేఖర్, అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి,భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి,అన్నపూర్ణ, కృష్ణదాసు, చంటిరెడ్డి, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఎంసీల ఎన్నికలు



కొలిమిగుండ్ల ఎస్సీ ప్రాథమిక పాఠశాల వద్ద చర్చలు జరుపుతున్న పోలీసులు



బేతంచెర్ల మోడల్ స్కూల్‌లో విద్యా కమిటీ చైర్మన్‌ను అభినందిస్తున్న దృశ్యం



పోలీస్ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్న అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె రూరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఎన్నికలు గురువారం ముగిశాయి. బనగానపల్లె మండలంలో 78 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఆయా పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు తెలిపారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలో 26 పాఠశాలలు ఉండగా అన్ని కమిటీలకు చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కమిటీకి చైర్‌పర్సన్‌గా దేవనమ్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జయకుమారి, ఉర్దూ ఉన్నత పాఠశాలకు మహబూబ్‌బాషా, గురుకుల పాఠశాలకు నాగలక్ష్మి, భీమునిపాడు, గుళ్లదూర్తి, రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వరుసగా వెంకటశివుడు, గోవిందుడు, వెంకటమహాలక్ష్మితో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు. ఎస్‌ఐ వరప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని 59 పాఠశాలలు ఉండగా మీర్జాపురంలో మాత్రమే ఎన్నిక అనివార్యమైంది. మిగతా అన్ని చోట్ల చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మీర్జాపురంలో జరిగిన ఎన్నికలో పిక్కిలి రమాదేవి చైర్‌పర్సన్‌గా విజయం సాధించింది. కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం వరకు హైడ్రామా చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలతో చర్చించి చివరికి ఏకగ్రీవం అయ్యేలా చూశారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని తాడూరు ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా సుధాకర్,వైస్ చైర్మన్‌గా లక్ష్మీదేవి, అనుంపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాలకు సంబంధించి చైర్మన్‌గా రవి, వైస్ చైర్మన్‌గా హనుమంతు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతం

బేతంచెర్ల: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. 55 పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కాగా, హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా పడినట్లు మండల విద్యాధికారి వెల్లడించారు. మోడల్ స్కూలు చైర్మన్ గా ఎన్నికైన బాలకృష్ణ, వైస్ చైర్మన్ మౌనికను ను ప్రిన్సిపాల్ మరియదాసు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యా కమిటీ ఎన్నికల పరిశీలన

డోన్ రూరల్: మండలంలో విద్యా కమిటీ ఎన్నికల నిర్వహణను గురువారం నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాలైన ఓబులాపురం, కొచ్చెర్వు, చింతపేట, గోసానిపల్లి గ్రామాల్లో పర్యటించినట్లు ఆయన వెల్లడించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ అత్యుత్సాహం

డోన్ టౌన్: మండలంలో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. కొన్ని గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోయి చైర్మన్ పదవి కోసం పట్టుబట్టడంతో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 78 స్కూళ్ల ఉండగా 70 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా వెంకటాపురం,చింతలపేట, ఇందిరాంపల్లెతో పాటు మరొక గ్రామంలో ఎన్నికలు జరిగాయి. గోసానిపల్లె, చనుగొండ్లతో పాటు మరో రెండు గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకాక పోవడంతో కోరం లేక వాయిదా వేసినట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు.



పాతపేట హైస్కూల్‌లో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ వరప్రసాద్ సూచించారు.స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్తున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

జీఎన్‌ఎస్‌ఎస్ ద్వారా నీటి విడుదల



ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వలో పెరిగిన నీటి మట్టం

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న గాలేరు నగరీ సుజలస్రవంతి(జీఎస్ఎస్ఎస్) కాల్వ ద్వారా సుమారు ఐదు వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ఆ నీరు గురువారం ఉదయానికి బనగానపల్లె మీదుగా అవుకు రిజర్వాయర్‌కు చేరుకుంది. 4 టీఎంసీల సామర్థ్యమున్న అవుకు రిజర్వాయర్ నిండిన తరువాత కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్‌కు విడుదల చేస్తారు.

బహిరంగ వేలాలు వాయిదా

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో పలు వ్యాపారాల నిర్వహణ హక్కులను పొందేందుకు ఈనెల 14న నిర్వహించాల్సిన బహిరంగ వేలాలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని, వేలంలో పాల్గొనే పాటదారులు గమనించాలని ఆయన కోరారు.

డోన్ తహసీల్దార్‌గా సత్యదీప్

డోన్ టౌన్ :మండల తహసీల్దార్‌గా సత్యదీప్‌ను నియమించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న మాధవకృష్ణారెడ్డి ఎన్నికల తరువాత కడప జిల్లాకు వెళ్లడంతో ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యదీప్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

కోలుకోలేక మహిళ మృతి

డోన్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మీదేవి(54)అనేమహిళ కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందా రు.పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన లక్ష్మీ దేవి పొలం విషయంపై బుధవారం ఉడుములపాడు గ్రామ సచివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగాతాడిపత్రి నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీకొంది.వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు పెద్దాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పట్టణ ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

దాడి కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన మహమ్మద్ జిలానిపై ఇదే గ్రామానికి చెందిన నాగరాజు, అతని సోదరుడితో పాటు మరో ముగ్గురు కలిసి దాడి చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. నాపరాయిగని విషయంలో దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదే గని విషయంలో మహమ్మద్‌జిలాని తనపై దాడి చేసినట్లు రమాదేవి ఇచ్చిన ఫిర్యాదులో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ పై కేసు నమోదు

బేతంచెర్ల: ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలపరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన కొమ్ము పెద్దక్క గత నెల 29వ తేదీన బేతంచెర్లకు వెళ్లి ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తుంది. ఊరి వద్ద బస్సు నిలిపే విషయంలో డ్రైవర్ రమేష్ , కండక్టర్ నిర్లక్ష్యంగా వ్యహరించడంతో ఆమె కింద పడింది. ఈ ఘటనలో చేయి విరిగింది. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా గురువారం తెలిపారు.

తల్లి పాలపై అవగాహన

డోన్ రూరల్ : పట్టణంలోని స్థానిక 19, 21వ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంతకుముందు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. తల్లి పాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యన్నిస్తాయని ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు.

ప్రణాళికతో చదవాలి



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటి సాధనకు ప్రణాళికతో చదవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని కస్తూరీబా గాంధీ గురుకుల పాఠశాలతో పాటు వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లోని కేజీబీవీలను ఆమె తనిఖీ చేశారు. వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి సబ్ స్టేషన్ మల్లెంపల్లె ఫీడర్ కింద 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో మూడు రోజులు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు లక్ష్మంపల్లె, మల్లెంపల్లె, బోంతిరాళ్ల గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీ ఫేస్ కరెంటు తెల్లవారు జామున 5 గంటల నుంచి 10గంటల వరకు, మళ్లీ3గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఇస్తామన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

డోన్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పేర్కొన్నారు. పట్టణంలో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్న వైఎస్, కోట్ల నగర్‌లలో వర్షం నీరు ఎక్కువగా నిలిచిపోవడంతో దోమల వ్యాప్తి చెందుతున్నాయన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గురువారం 23వ వార్డులో అధికారులతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా వాటి యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.